


JANAMGONTHU TELUGU DAILY

# జనంగొంతు

Online:- https://janamgonthu.in
"https://epaper.janamgonthu.in

తెలుగు దినపత్రిక

**కావలెను**
**జనం గొంతు**
తెలుగు దిన పత్రికకు
భ్యూరో ఇన్-చార్జ్, స్టాఫ్ రిపోర్టర్
మండలాల వారిగా
విలేఖరులు కావలెను
సంప్రదించు: 9542226669

కరీంనగర్ సంపుటి : 10 సంచిక : 258 గురువారం 18-06-2026 4 పేజిలు వెల 2/-

## ఉద్యమకారుల గుర్తింపునకు సంప్రదింపులు

### ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా సలహాలు, సూచనలు స్వీకరణ
### ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఛైర్మన్ కేకే



(హైదరాబాద్)

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఈ నెల 23 నుండి అమరజ్యోతి కేంద్రంగా వివిధ వర్గాలతో సంప్రదింపులు నిర్వహించాలని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ నిర్ణయించింది. విద్యార్థి జేఏసీ ప్రతినిధులు, కళాకారులు, రచయితలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, అడ్వకేట్లు, డాక్టర్స్ తదితర వర్గాలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు, సూచనలు కమిటీ స్వీకరించనున్నది. హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారకం అమరజ్యోతిని కమిటీ సభ్యులు సందర్శించారు.

ఈ సందర్భంగా అమరజ్యోతి ప్రాంగణంలో నిర్మించిన వివిధ గదులను పరిశీలించిన కమిటీ సభ్యులు ప్రత్యేకంగా ఆడియో-విజువల్ రూమ్‌ను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కమిటీ ఛైర్మన్ కె.కేశవరావు నేతృత్వంలో కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. 2001 నుండి 2014 వరకు రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ప్రజా సంఘాల ఉద్యమకారులు, ఉద్యమకారుల సంక్షేమ కమిటీలు, ఇతర వర్గాలతో రాజకీయాలకు అతీతంగా విస్తృతస్థాయిలో చర్చలు జరిపి ఉద్యమకారుల గుర్తింపునకు అవసరమైన సూచనలు, సలహాలను దశలవారీగా సేకరించాలని కమిటీ నిర్ణయించింది. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో సూచనలు స్వీకరించనున్నారు.

ఆన్‌లైన్ విధానంలో ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయడంతోపాటు, ఆఫ్‌లైన్ విధానంలో ఉద్యమకారులు తమ ప్రాతినిధ్యాలు సమర్పించేందుకు ప్రత్యేక అధికారులను నియమించి అందిన అభిప్రాయాలు, వివరాలను నమోదు చేసేలా చర్యలు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లో చదవడం నామోషీ అనే ఆలోచన పోవాలి : రేవంత్‌రెడ్డి



(రంగారెడ్డి)

రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసిన మైదానంలో సరదాగా విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. "రాష్ట్ర బడ్జెట్‌లో దాదాపు రూ.27 వేల కోట్లు విద్యాశాఖపైనే ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ ఏర్పాటు చేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రుల్లో అపోహలు ఉన్నాయి. అందరి అపోహలు తొలగించేందుకే టీపీఎస్ నిర్మాణం చేపట్టాం. విద్య మాత్రమే మన జీవితాలను సమూలంగా మార్చగలదు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరం.

ప్రభుత్వ బడుల్లో చదవడం నామోషీ అనే ఆలోచన పోవాలి. ఇక్కడ చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారు. గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి.. కుల వ్యవస్థను ప్రోత్సహించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ పాఠశాలలు పెట్టింది. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తాం. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే విమర్శలు చేశారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే.. అవి నెలరోజులకే చిరిగాయి. ఈ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోంది. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచాం. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని ఒకాయన అంటున్నారు.. ఎలా సాధ్యమో చెప్పాలి. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం" అని సీఎం అన్నారు.

## గ్రామీణ యువతకు ఉపాధి లభించేలా శిక్షణ ఇవ్వాలి : మంత్రి సీతక్క



(ములుగు)

పలు సంస్థల యజమాన్యాలు ఇస్తున్న శిక్షణ యువతకు ఉపాధి లభించేలా ఉండాలని, వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రియా ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, సాంకేతిక రంగంలో వారికి కొత్త అవకాశాలను అందించే వేదికగా ఈ సంస్థ నిలవాలని ఆకాంక్షించారు. ఇటువంటి సంస్థలు జిల్లాలో యువత భవిష్యత్తుకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ములుగు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చంద్రకళ, శ్రియా ఇన్ఫోటెక్ వ్యవస్థాపకులు రవికుమార్, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆధార్ పిటిషన్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు




(ఢిల్లీ)

ఆధార్ కార్డును కేవలం గుర్తింపు కార్డుగా మాత్రమే ఉపయోగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్ పై సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్ పై స్పందన తెలియజేయాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.మోహన్ లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఇప్పటికే కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఇలాంటి ఇతర కేసులతోనే ఈ పిటిషన్‌ను కూడా జత చేస్తున్నట్లు కోర్టు తెలిపింది. ఉడాయ్ జారీ చేసే ఆధార్ కార్డులను పౌరసత్వం, నివాసం, పుట్టిన తేదీ లేదా చిరునామా ధృవీకరణ కోసం చాలామంది వినియోగిస్తున్నారని, దీంతో ఆధార్ దుర్వినియోగం అవుతోందని న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ తరపున న్యాయవాది అశ్వనీ దూబే సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ వేశారు.

ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగా మాత్రమే పరిమితం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. కొత్త ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు (ఫారం-6 లో) పుట్టిన తేదీకి, నివాసానికి రుజువుగా ఆధార్ కార్డును వాడుతున్నారని, ఇది ఆధార్ చట్టం-2016 లోని సెక్షన్ 9 కి, ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950 లోని సెక్షన్ 23(4) కి, అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 కి విరుద్ధమని పిటిషనర్ వాదించారు.

ఆధార్ అనేది పౌరసత్వానికి లేదా నివాసానికి నిరూపణ కాదని ఆధార్ చట్టంలోని సెక్షన్ 9 స్పష్టం చేసింది. అలాగే ఆధార్ అనేది కేవలం ఒక వ్యక్తి గుర్తింపునకు మాత్రమే సాక్ష్యం కానీ, అది పౌరసత్వాన్ని, చిరునామాను లేదా పుట్టిన తేదీని ధృవీకరించే పత్రం కాదని ఉడాయ్ నోటిఫికేషన్ కూడా వెల్లడించింది. ప్రస్తుతం ఓటరు నమోదులో ఉన్న ధృవీకరణ విధానం సరిగ్గా లేదని, దీంతో సరైన ఆధారాలు లేని వారు కూడా ఓటర్ల జాబితాలో చేరే ప్రమాదం ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ధృవీకరణ వ్యవస్థలో మార్పులు చేయాలని, ఈ మార్పులను పర్యవేక్షించడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్ కోరింది.

## వృద్ధులకు ఆసరాగా హెల్ప్ ఏజ్..

### నివేదికలో వెలుగు చూసిన ఆసక్తికర అంశాలు..



(హైదరాబాద్)

వృద్ధుల జీవన విధానంపై హెల్ప్ ఏజ్ ఇండియా ఈ ఏడాది విడుదల చేసిన జాతీయ నివేదికలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడించింది. అనువైన జీవనం కోసం ఎక్కువ శాతం మంది వృద్ధులు సంరక్షకులపై ఆధారపడాల్సి వస్తోందని పేర్కొంది. 10 రాష్ట్రాల్లోని 20 ముఖ్యమైన జిల్లాల్లో 2224 వృద్ధులపై అధ్యయనం చేసింది. వృద్ధుల సంరక్షణ అవసరాలు 30% మందికి మంచం ఎక్కడానికి, దిగడానికి సహాయం అందిస్తున్నారు. 27% మందికి స్నానం, వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో మద్దతు అవసరం అని నివేదించింది.

67% మందికి రవాణాలో, 64% మందికి డబ్బు నిర్వహణలో, 63% మందికి షాపింగ్‌లో, 61% మందికి ఫోన్ వాడకంలో సహాయం అవసరం అందిస్తున్నట్లు సర్వే నివేదికలో వెల్లడైంది. 94% మంది కుటుంబ సభ్యుల నుంచి సంరక్షణ పొందుతున్నారు. ఇందులో జీవిత భాగస్వామి (30%), కుమారులు (31%), కోడళ్లు (17%) సహకారం అందిస్తున్నారు. 69% మంది సంరక్షణ పొందడంలో కనీసం ఒక సవాలును ఎదుర్కొంటున్నారు. మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్న వృద్ధులు అత్యధిక అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. వీరిలో 52% మంది సంరక్షకులు అందుబాటులో లేరని, 17% మంది నిర్లక్ష్యానికి గురవుతున్నారు.

**ఆరోగ్య సమస్యలు..** చేతులు, పాదాల్లో నొప్పి, తలనొప్పి తో పాటు రక్తపోటు పెరుగుతోందని నివేదించారు. 7% మంది కుంగుబాటు, ఒంటరితనాన్ని ఎదుర్కొంటున్నారు. 78% మంది వృద్ధులు మూడేళ్లలో కనీసం ఒక వాతావరణ సంబంధిత ప్రమాదాన్ని ఎదుర్కొన్నారు. వడగాలులు (45%), వరదలు (27%) కరువు (20%) అత్యంత సాధారణ ప్రమాదాలుగా ఉన్నాయి. వయోవృద్ధుల సంరక్షణపై 48 ఏళ్లుగా హెల్ప్‌ఏజ్ ఇండియా పనిచేస్తోంది. భవిష్యత్ తరాలకు పెద్దల గొప్పతనాన్ని వివరిస్తూ... విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోందని సంస్థ తెలంగాణ, ఏపీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెల్లడించారు.

## తమిళనాడు రైతులకు సీఎం విజయ్ గుడ్‌న్యూస్..



(తమిళనాడు)

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రైతులకు గుడ్‌న్యూస్ చెప్పారు. సహకార బ్యాంకు ద్వారా రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేయనున్నట్లు ప్రకటించారు. దీని ప్రకారం రూ.75,000 వరకు పంట రుణాలు తీసుకున్న సన్న, చిన్న, పెద్ద రైతులకు రుణమాఫీ చేయనున్నట్లు ప్రకటించారు. ఇక, రూ.75వేల కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతులకు ఒక్కొక్కరికి రూ.35,000 చొప్పున మాఫీ చేయనున్నట్లు తెలిపారు. గత నెలలో సన్నకారు రైతులకు రూ.50వేల వరకు రుణమాఫీ.. చిన్న రైతులకు రూ.50వేల వరకు ఉన్న రుణాలపై 50 శాతం రుణమాఫీ ప్రకటించారు. రూ.లక్ష వరకు పంట రుణాలు ఉన్న పెద్ద రైతులకు రూ.5వేల వరకు రుణమాఫీ చేస్తామన్నారు. అయితే, దీనిపై రైతులు నిరసన వ్యక్తంచేశారు. ఈ క్రమంలో సచివాలయంలో సీఎం విజయ్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఈ పథకంలో మార్పులు చేశారు. తాజా రుణమాఫీతో రాష్ట్ర వ్యాప్తంగా 14.43 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. కాగా.. రాష్ట్ర ప్రభుత్వంపై రూ.5,932 కోట్ల మేర అదనపు భారం పడనుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా రుణమాఫీ కింద సహకార బ్యాంకులకు అందించాల్సిన మొత్తాన్ని 45-60 రోజుల్లో ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపింది.

## పేద దేశాల ప్రజలు వస్తే.. మనమూ పేదలమవుతాం : ట్రంప్




(ఢిల్లీ)

అమెరికాలోని అక్రమ వలసదారులపై ట్రంప్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. ఇప్పటికే వేల మంది వలసదారులను తమ స్వదేశానికి తిప్పి పంపింది. ఈ క్రమంలోనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి వలసదారులపై విమర్శలు గుప్పించారు. ఇతర దేశాల నుంచి పెద్దఎత్తున ప్రజలు అమెరికాకు వలస వస్తుండడం వల్ల దేశ భవిష్యత్తు ప్రభావితమవుతుందన్నారు. పేద దేశాల ప్రజలు ఇక్కడికి వస్తే.. మనమూ పేదలమవుతామని వ్యాఖ్యానించారు. తర్వాత ఎవరూ ఏమీ చేయలేరని అన్నారు.

వలసలను అరికట్టి.. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా మార్చుకుందామంటూ ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ఈనెల మొదట్లో హెచ్-1బీ వీసాలపై లక్ష డాలర్ల ఫీజు ఫెడరల్ కోర్టు కొట్టివేయడాన్ని ట్రంప్ విమర్శించారు. ఫెడరల్ జడ్జిలు తమను బాగా ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. మరోవైపు వైట్‌హౌస్ అధికార ప్రతినిధి టేలర్ రోజర్స్ మాట్లాడుతూ.. 'దశాబ్దాలుగా హెచ్1బీ కార్యక్రమం తీవ్రంగా దుర్వినియోగమవుతోంది. దానిని సరిచేయడా నికి అధ్యక్షుడు ట్రంప్ పలు చర్యలు చేపట్టారు. ఇలాంటి ఆదేశాలనే వాషింగ్టన్‌లోని ఫెడరల్ జడ్జి ఒకరు సమర్థించారు. దీని విషయంలోనూ సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి వీలాపూర్ గ్రామపంచాయతీ ప్రత్యేక నిర్ణయం

సిద్దిపేట

బెజ్జంకి మండలంలోని వీలాపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బలోపేతం చేసి విద్యార్థుల చేరికలను పెంచే లక్ష్యంతో గ్రామపంచాయతీ పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. అంగన్వాడీతో పాటు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో తొలి ప్రాధాన్యత కల్పించనున్నట్లు సర్పంచ్ చిలుముల సతీష్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# ప్రీస్కూల్ విద్య ప్రాముఖ్యతపై అవగాహన..

జగిత్యాల

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్ విద్య యొక్క ప్రాముఖ్యతపై మహిళా సంఘాల సభ్యులకు అంగన్వాడి ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ప్రీ స్కూల్ విద్య యొక్క ప్రాముఖ్యత గురించి వివరించి మూడు సంవత్సరాల పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపాలని మహిళా సంఘాల సభ్యులను మరియు తల్లులను కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయులు ఇందిర, ప్రమీల, రాధ, మంజుల, రాజకళ, రమాదేవి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం..

మంచిర్యాల

మందమర్రి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మందమర్రి పట్టణంలో పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఆవరణలోని చెత్తను తొలగించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన స్వచ్ఛ భారత్ అభియాన్ దేశవ్యాప్తంగా పరిశుభ్రతపై చైతన్యంతీసుకువచ్చిందన్నారు. ప్రతి పౌరుడు తమ ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంపై పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్నీం, అధ్యాపక బృందం పాల్గొన్నారు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఇన్‌చార్జి అక్కల రమేష్, సీనియర్ నాయకులు డీవీ దీక్షితులు, మల్యాల రాయమల్లు, రొడ్డ మోహన్, మేకల రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి శనిగారపు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గాదె రాములు, కార్యదర్శి దుర్గం సత్యంబాబు, మిట్ట తిరుపతి, జక్కుల మహేష్, ప్రవీణ్ తదితరులు, పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## రాష్ట్ర ప్రథమ చికిత్స వైద్యుల అధ్యక్షులు సిరిమల్ల మల్లేశం

కరీంనగర్

వర్షాకాలం మొదలైన సందర్భంగా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున ముఖ్యంగా వర్షాకాలంలో అతిసారా వ్యాధితో బాధపడే అటువంటి అవకాశం ఉన్నందున సీజనల్ వ్యాదులు ప్రబలె అవకాశం ఎక్కువ కనుక, వర్షకాలం మొదలు కాగానె ఎక్కువగా వాంతులు, విరేచయాలు (డయేరియా) ముప్పు పోంచి ఉంటుంది. ఈ వర్షకాలం ముఖ్యంగా కలుషిత నీరు, అహారం తీసుకొవడం వలన వాంతులు, విరేచనాలు ప్రబలే అవకాశం ఉన్నందున, ఇది పిల్లలపై ఎక్కువ ప్రబావం ఉంటుంది..

దీనిపై ప్రజలకు అవగాహన కల్గించి, అప్రమతం చేయాలని, జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీన ప్రాంతాలలోని ప్రజలకు అందుబాటులొ ఉంటు ప్రథమ చికిత్స సేవలు అందించాలని ప్రథమ చికిత్స వైద్యులను, ఫస్ట్ ఎయిడ్ అసోసియేషన్ (ఫాన్ప-ఎన్.జి.ఓ) రాష్ట్ర అధ్యక్షులు సిరిమల్ల మల్లేశం కొరారు. ఈ సందర్భంగా డయేరియా, వాంతుల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు తమ వద్ద ఓ.అర్.యస్ ప్యాకేట్లు నిలువ ఉంచుకొని చికిత్స చేయాలని, యాంటి బయోటిక్ వాడకూడదని, శరీరం నుండి నీరు, లవణాలు ఎక్కుగా పొతుంటాయి కావున వెంట, వెంటనె ఓ.అర్.యస్. లిక్విడ్ అందిస్తుండాలని, శరీరం నుండి ఎక్కువ నీరు, లవణాలు



పొయినందున డిహైడ్రేషన్ వస్తుంది. ఇటువంటి పరిస్తితిలొ రక్తపొటు తగ్గడం, మత్రపిండాలు దెబ్బతిని ప్రాణాలు పొతుంటాయి. ఆలస్యం చేయకుండా వెంటనె సంబందిత డాక్టర్ వద్ద చూపించాలని తెలిపారు.

# అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి..

(కరీంనగర్)

మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక,అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినతి పత్రాలు పరిశీలించడమే కాకుండా బాధితుల సమస్యలను ఓపికగా విన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు,ఇందిరమ్మ ఇళ్లు,పింఛన్లు, తాగునీరు, రహదారులు, విద్యుత్, భూసంబంధ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు తమ ఫిర్యాదులను సమర్పించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచనలు చేశారు. కొన్ని అత్యవసర సమస్యల విషయంలో అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి



త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కాగా మరికొందరు ఆరోగ్య సమస్యలను డాక్టర్ కవ్వంపల్లి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా హాస్పిటల్ రిపోర్టులను పరిశీలించి వారి తగు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.

# వర్షాకాలం నాటికి ౯౦ శాతం అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం : ఎమ్మెల్యే నాయిని







వరంగల్

కాజీపేట 61వ డివిజన్‌లోని వెంకటాద్రి నగర్ మరియు ప్రశాంత్ నగర్ లలో కోటి రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం నాటికి డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో 90 శాతం పూర్తిచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. శంకుస్థాపనలు చేయడం, ప్రారంభోత్సవాలు నిర్వహిం చడం వరకే తమ బాధ్యత కాదని, నిర్ణీత గడువులో పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి పనికి కాలపరిమితి నిర్ణయించి, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు.

కాజీపేట అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్న ఆయన,గత ప్రభుత్వాల మాదిరిగా హామీలకే పరిమితం కాకుండా పనులు చేసి చూపిస్తున్నామని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాజీపేట రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులను వేగవంతం చేశామని, త్వరలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా కాజీపేట బస్‌స్టాండ్ నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లతో చర్చలు జరుపుతున్నా మని తెలిపారు. ప్రజా అవసరా లకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

గడిచిన రెండున్నర సంవత్స రాలుగా నగరంలో ఎటువంటి భూ కబ్జాలు జరగకుండా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు అన్ని ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నా మని తెలిపారు. ఇటీవల హంటర్ రోడ్ లో కొందరు వ్యక్తులు చేసిన ఉదాంతం ప్రజలు గమనించారని తెలిపారు.

వైఎస్సార్ నగర్ సంబంధిత అంశంపై జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ నిర్వహిస్తోందని చెప్పారు. ప్రైవేట్ భూములకు సంబంధించి కోర్టు తీర్పే అంతిమమని, ప్రభుత్వం న్యాయపరమైన నిర్ణయాలను గౌరవిస్తుందని పేర్కొన్నారు. భూమి ప్రభుత్వ స్థలమని తేలితే ఒక్క గజం కూడా ఆక్రమణకు గురికాకుండా కాపాడుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అవసరమైతే ఆ స్థలంలో బస్‌స్టాండ్, పోలీస్ స్టేషన్ లేదా ఇతర ప్రజాప్రయో జన కార్యక్రమాలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలి స్తామని తెలిపారు. గతంలో జరిగిన భూ ఆక్రమణలపై స్పందించని ప్రతిపక్ష పార్టీలు ఇప్పుడు రాజకీయ విమర్శలు చేయడం సమంజసం కాదని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజల ఆస్తులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో తమ ప్రభుత్వం రాజీ పడదని ఆయన స్పష్టం చేశారు.

# 16వ వార్డులో కల్వర్టు పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి..

జగిత్యాల

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి లోని 16 వార్డ్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలను మైలారపు లింబాద్రిహొ ప్రారంభించారు ఇందులో భాగంగా కల్వర్టు పనులను మున్సిపల్ చైర్మన్ శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో వరద దృష్ట్యా కల్వర్టు పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు కౌన్సిలర్ అరిసె వనజ మురళి మాట్లాడుతూ వర్షాకాలం ఉన్నందున మురికి నీరు రోడ్డుపై ప్రవహించకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కల్వర్టు పనులు పూర్తిచేసి వార్డు అభివృద్ధిలో తోడ్పడు ఉంటామని ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం దృష్టికి మరియు మా దృష్టికి తీసుకురావాలని వీలైనంత త్వరగా అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఎల్లవేళలా ఉంటానని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో కమీషనర్ శ్రీనివాస్ గౌడ్,వైస్ చైర్మన్ ఓంకారి నవీన్‌హొహొమెట్‌పల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు



రాంబాబు కౌన్సిలర్లు అరికెల రాకేష్ అనూష డి ఈ నాగేశ్వర్ రావు శానిటరీ ఇన్స్పెక్టర్ ముజీబ్ మరియు మ్యాడం గోపి వెలుగందుల తిరుపతి రాకేష్ అభిలాష్, కుమార్, భాస్కర్ చారిహొహొతిరుసుల్ల అర్జున్ దొంతుల శ్రీనివాస్ గుండ లవకుమార్ మ్యాకల ఆనంద్ 16 వార్డ్ ప్రజలు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బోనాల జాతర 2026: ముస్తాబవుతున్న హైదరాబాద్

(హైదరాబాద్)

తెలంగాణ రాష్ట్ర పండుగ, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన ఆషాఢ మాస బోనాల జాతర సంబురాలు షురూ కానున్నాయి. ఈ ఏడాది జూలై 19వ తేదీన గోల్కొండ జగదాంబ అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో ఈ చారిత్రాత్మక ఉత్సవాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. దాదాపు నెల రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలు ఆగస్టు 10వ తేదీ వరకు హైదరాబాద్ మహానగరంలో అంగరంగ వైభవంగా కొనసాగుతాయని ఉత్సవ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు.

**జూలై 19న ఘటాల ఊరేగింపు..** ఆషాఢ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని జూలై 19న గోల్కొండ కోటలో జగదాంబ అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తొలి బోనం సమర్పిస్తారు. అదే రోజున నగరంలోని పలు ప్రధాన ఆలయాల్లో ఘటాల ఊరేగింపు కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించనున్నారు. నాటి నుంచి ప్రతి ఆది, గురువారాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, బోనాల సమర్పణలు ఉంటాయి.

**ఆగస్టు 2న ప్రధాన బోనాలు.. ఆగస్టు 3న రంగం..** ఉత్సవాల్లో అత్యంత కీలకమైన ఘట్టాలు ఆగస్టు మొదటి వారంలో జరగనున్నాయి. ఆగస్టు 2 (ఆదివారం): లష్కర్ (సికింద్రాబాద్) ఉజ్జయిని మహంకాళి అమ్మవారితో పాటు నగరంలోని ప్రధాన ఆలయాల్లో అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున బోనాలను సమర్పిస్తారు. ఆగస్టు 3 (సోమవారం):



సికింద్రాబాద్ మహంకాళి ఆలయంలో పవిత్ర 'రంగం' (భవిష్యవాణి) కార్యక్రమం, అనంతరం అంబారీపై అమ్మవారి సాగనంపే ఊరేగింపు వైభవంగా జరుగుతాయి. గోల్కొండతో ప్రారంభమయ్యే ఈ జాతర.. ఆ తర్వాత లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారు, పాతబస్తీలోని ఉమ్మడి దేవాలయాల ఉత్సవాలతో ముగుస్తుంది. ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి దేవాలయాల ఘటాల సామూహిక ఊరేగింపు. గజరాజుపై అమ్మవారి శోభాయాత్రతో ఈ ఏడాది ఆషాఢ బోనాల జాతర ముగియనుంది. బోనాల పండుగను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ముందస్తు ఏర్పాటు చేస్తోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ. జలమండలి, పోలీస్, విద్యుత్ శాఖల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు, భారీ బందోబస్తును కల్పించనున్నారు.

# మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: ఎమ్మెల్యే

(హైదరాబాద్)

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్‌తో కలిసి పర్యటించి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి, డ్రైనేజీ, విద్యుత్ సరఫరా ఇతర మౌలిక వసతుల సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శ్రద్ధగా విన్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి కొరత తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే డ్రైనేజీ, విద్యుత్ ఇతర స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ



కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, కాలనీ అధ్యక్షులు వాసు చారి, కార్యదర్శి మధు ముదిరాజ్, స్థానిక నాయకులు భానూరి రాకేష్, రిజ్వాన్, నరేష్, శ్రీకాంత్ గౌడ్, భీష్మాచారి, యాదయ్యతో పాటు కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంజీ యూనివర్సిటీలో నూతన కోర్సుల కోసం ఎబివిపి వినతి



(నల్లగొండ)

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో నూతన కోర్సుల ఏర్పాటు చేయాలని ఉపకులపతి ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎబివిపి యూనివర్సిటీ కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన ఉన్నత విద్యను అందించడంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ అన్ని యూనివర్సిటీలకు పోటీ పడుతూ ముందు వరుసలో ఉంది అని, ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఉన్నత విద్యను అందిస్తున్న ఏకైక విద్యా సంస్థ మహాత్మా గాంధీ యూనివర్సిటీ మాత్రమే అని నేడు యూనివర్సిటీలో కేవలం కొన్ని కోర్సులు మాత్రమే అందిస్తుందని విద్యార్థుల ఆకాంక్షలు అనుగుణంగా యూనివర్సిటీలో ఎంఏ పొలిటికల్ సైన్స్, ఫిలాసఫీ, సోషియాలజీ, లిటరేచర్, హిందీ, సంస్కృతం, జర్నలిజం, యోగా, ఎమ్మెస్సీ జువాలజీ, మైక్రో బయాలజీ, ఫారెస్ట్రీ, ఎమ్మెడ్, బిఎడ్, ఎంపెడ్, బి పెడ్, బీటెక్ కోర్సులను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ క్రమంలో ఎబివిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఛత్రపతి చౌహాన్, సంపత్ , మౌనేష్ చారి,విజయ్, వెంకటేష్,సతీష్,సూర్య,అజయ్,రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలకు వెలుగులు

(ఖమ్మం)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి గ్రామానికి మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్ తెలిపారు. ఏన్కూర్ మండల పరిధిలోని తిమ్మారావుపేట గ్రామంలో టీఎస్ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఏడీఏ (అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్) భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ శాఖలో అనేక సంస్కరణలు చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. వైరా నియోజకవర్గంలో తిమ్మారావుపేట కేంద్రంగా విద్యుత్ శాఖకు సంబంధించిన రెవెన్యూ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఏడీఏ భవనంలో ఏడీఏ, ఏఈ, ఈఆర్వో తదితర విద్యుత్ శాఖ సేవలు ఒకేచోట అందుబాటులో ఉండటంతో, విద్యుత్ బిల్లులు మరియు ఇతర సమస్యల పరిష్కారం కోసం ప్రజలు



దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శ్రీనివాసాచారి, ఎస్ఏఓ శ్రీధర్, డీఈలు బుద్ధుపవర్, రమేష్, ఏఓ శ్రీధర్, ఏడీఈ యాసీన్, ఏఈ ఉమాకాంత్, వెంకన్న, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దుబాయిలో క్యాబ్ డ్రైవర్స్, బైక్ రైడర్స్ ఉద్యోగ అవకాశాలు..



(గద్వాల)

తెలంగాణ ప్రభుత్వం కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా దుబాయ్‌లో క్యాబ్ డ్రైవర్స్ మరియు బైక్ రైడర్ ఉద్యోగాల అవకాశాలు కల్పిస్తోందని జిల్లా ఉపాధి కల్పనాధికారిణి జి ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు 23 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తులు డ్రైవింగ్/రైడింగ్ అనుభవం, ప్రాథమిక ఇంగ్లీష్ మాట్లాడే నైపుణ్యం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. క్యాబ్ డ్రైవర్ల ఉద్యోగానికి 100 శాతం కంపెనీ ఆధారిత నియామకం ఉంటుంది. వసతి, భోజనం, రవాణా సౌకర్యాలు కంపెనీ ద్వారా కల్పించబడతాయి.

**అప్లికేషన్ వివరాలు...** నెలకు AED 2,500 నుండి AED 4,000 వరకు వేతనం (సుమారు రూ.64,850 నుండి రూ.1,03,770 వరకు) అందించబడుతుంది. బైక్ రైడర్ ఉద్యోగానికి కూడా 100 శాతం కంపెనీ ఆధారిత నియామకం ఉంటుంది. నెలకు ~ాజుణ 2,500 వరకు వేతనం (సుమారు రూ.64,850 వరకు) అందించబడుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 25వ తేదీ 2026 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డు, పోలీస్ వెరిఫికేషన్/సిఐడి లేదా ఇతర సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440049520, 9440048590 నంబర్లను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి కల్పన అధికారి జి ప్రశాంతి తెలిపారు.

PRINTED, PUBLISHED AND OWNED BY NYALAKONDA ANIL RAO PRINTED AT BALAJI PRINTING PRESS 4-4-85, TILAK ROAD, KARIMNAGAR. PUBLISHED FROM H.NO. 1-5, NAGIREDDYPUR VILLAGE, GANGADHARA MANDAL, DIST KARIMNAGAR- TELANGANA EDITOR :NYALAKONDA ANIL RAO. janamgonthu@gmail.com. cell: 9542226669